క్లుప్తంగా

నేడు గీతాగానం చిత్ర ప్రదర్శన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన విభూతి బ్రదర్స్ నటించిన గీతాగానం చిత్రాన్ని గురువారం థియేటర్లో ప్రదర్శించనున్నారు. బుర్రకథ కళాకారులైన విభూతి లోవరాజు, విభూతి శ్రీనివాసరాజు, విభూతి రాంప్రసాద్ ఈ చిత్రంలో నటించారు. నిర్మాతగా జానకి రాణి రామరాజు వ్యవహరించగా, నారాయణ బొమ్మిరెడ్డిపల్లి రచన చేశారు. అనిల్ ఆలేటి, విజయ్ కుమార్ సినిమాటోగ్రఫీ అందించగా, అనిల్ ఆలేటి డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఊర్వశి కాంప్లెక్స్‌లోని రంభ థియేటర్లో గురువారం సాయంత్రం 5.30 గంటలకు ఈ చిత్రాన్ని ప్రేక్షకుల సౌకర్యార్థం ఉచితంగా ప్రదర్శిస్తున్నట్టు విభూతి బ్రదర్స్ తెలిపారు.

నేటి నుంచి రైతులకు శిక్షణ

కడియం: మేలైన పంటల యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు రైతులకు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చి మేనేజ్‌మెంట్ (ఎన్ఏఏఆర్ఎం), ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు. శిక్షణ అనంతరం క్షేత్రస్థాయి పరిశీలనకు కె.గంగవరం తీసుకువెళతారన్నారు.

గడ్డిమేటు దగ్ధం

కడియం: కడియపులంక పంచాయతీ పరిధి దోసాలమ్మ కాలనీ – బుర్రిలంక రోడ్డులోని ఆదిత్య నర్సరీలో ఉన్న గడ్డిమేటు బుధవారం కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 వేల ఆస్తినష్టం సంభవించింది. ఉద్దేశపూర్వకంగా కొందరు గడ్డిమేటుకు నిప్పు పెట్టారని నర్సరీ రైతు పాటంశెట్టి వెంకటరమణ కడియం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువత సేవాభావంతో మెలగాలి



ఉన్నికృష్ణన్‌ను సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: భారతీయ రైల్వేలో లోకో ఇన్‌స్పెక్టర్‌గా 35 ఏళ్ల సేవలు అందించిన తాను, మిగిలిన జీవితాన్ని సమాజ సేవలో కొనసాగించే ఉద్దేశంతో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసినట్టు కేవీ ఉన్నికృష్ణన్ తెలిపారు. బుధవారం బొమ్మూరులోని స్వామి వివేకానంద ఆరోగ్యకేంద్రంలో ఆయనకు అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు హాజరయ్యారు. ఉన్నికృష్ణన్‌ను రైల్వే సీనియర్ డివిజనల్ ఆపరేషనల్ ఇంజినీర్, రైల్వే ఉద్యోగులు పలువురు ప్రముఖులు సన్మానించారు. కార్యక్రమంలో రాకా సుధాకర్, డాక్టర్ కర్రి రామారెడ్డి, రిమ్మలపూడి సుబ్బరాజు, బొమ్మల దత్తు పాల్గొన్నారు.

అతిథులకు మొక్క బహుమతి



అతిథికి మొక్కను అందజేస్తున్న వధూవరులు

కడియం: ఆప్యాయంగా ఆశీర్వదించేందుకు విచ్చేసిన అతిథులకు శుభకార్యాల్లో ఏదైనా బహుమతిని ఇవ్వడం ఆనవాయితీ. అయితే కొత్తగా పెళ్లయిన ఓ జంట పర్యావరణ పరిరక్షణ స్ఫూర్తితో తమ వివాహ వేడుకకు వచ్చిన అతిథులకు మొక్కలను బహుమతిగా ఇచ్చింది. కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన ఈద్పుగంటి భూపయ్యచౌదరి కుమార్తె శ్రీలక్ష్మీ కావ్య, ధీరజ్ కృష్ణ చైతన్య వివాహం రిసెప్షన్ రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ మొక్కలను ప్రత్యేకంగా ప్యాక్ చేసి అందజేశారు.

బ్రాహ్మణ మహిళా సదస్సు పాట విడుదల



పాటను ఆవిష్కరిస్తున్న దుర్గగుడి ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం మార్చి 5న రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహిళా సదస్సుపై రూపొందించిన పాటను దుర్గగుడి ఈవో భ్రమరాంబ బుధవారం విడుదల చేశారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సమాఖ్యకు చెందిన పలువురు ప్రతినిధులు హాజరయ్యారు. మహిళలను చైతన్య పరుస్తూ రూపొందించిన పాట ఉన్న ల్యాప్‌టాప్‌లో బటన్ నొక్కి ప్రారంభించారు. కార్యక్రమంలో సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, మహిళా అధ్యక్షురాలు రెంటచింతల దీప్తి, కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ తోలేటి శిరీష్, రాష్ట్ర కార్యదర్శి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మధరకు రెక్కలు

- కిలో రూ.40 నుంచి రూ.50
- దిగుబడి తగ్గడమే కారణం



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: వేసవి రాకుండానే నిమ్మధరకు రెక్కలొచ్చాయి. గతంలో రాజమహేంద్రవరం ప్రాంతం నుంచి వివిధ ప్రాంతాలకు నిమ్మకాయలను సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లోని రాజానగరం తదితర మండలాల్లో పండించిన నిమ్మకాయలు రాజమహేంద్రవరం మార్కెట్‌కు తీసుకువచ్చి రైతులు విక్రయించేవారు. ఇక్కడ నుంచి వ్యాపారులు ఒడిశా, జైపూర్ తదితర ప్రాంతాలకు అమ్మకాలు జరిగేవి. గతంలో రాజమహేంద్రవరం నుంచి 10 లారీల (లారీకి 25 టన్నులు) నిమ్మకాయల అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం ఒక్కలారీ కూడా పూర్తిస్థాయిలో పంపించలేని పరిస్థితి నెలకొంది.

దిగుబడి లేక..

రాజానగరం మండలంలోని నిమ్మతోటల్లో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. కరోనా అనంతరం తోటలకు వైరస్ సోకడంతో పూతపూసినప్పటికీ రాలిపోయి కొమ్మలు ఎండిపోవడం జరుగుతోంది. దీంతో దాదాపుగా నిమ్మ దిగుబడి తగ్గిపోవడంతో హైదరాబాద్ నకరికల్లు, కనిగిరి ప్రాంతాల నుంచి నిమ్మకాయలను దిగుమతి చేసుకుంటున్నారు. 20 రోజుల క్రితం వరకు రూ. 25 వరకు ఉన్న ధర ఒక్కసారిగా రూ.40 నుంచి రూ.50 వరకు పలుకుతుంది.

చిరు వ్యాపారులకు భారం

రాజమహేంద్రవరం నగరంలో నిమ్మకాయలు విక్రయించే చిరు వ్యాపారులు కిలో రూ.40 నుంచి రూ.50కు వ్యాపారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. దీంతో వినియోగదారులకు నాలుగు నిమ్మకాయలను రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉండడంతో నిమ్మకాయకు డిమాండ్ ఏర్పడడంతో మరింత రేటు పెరిగే అవకాశం కనిపిస్తుంది.

దిగుబడి బాగా తగ్గింది



ప్రస్తుతం కిలో ధర రూ.40 నుంచి రూ.50 వరకు ఉన్నప్పటికీ మన ప్రాంతంలో దిగుబడి బాగా తగ్గిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి నిమ్మకాయలను కొనుగోలు చేసి దిగుమతి చేసుకుంటున్నాం. గతంలో రాజమహేంద్రవరం మార్కెట్ నుంచి రోజుకు పది లారీలు పంపించేవాళ్లం. ఇప్పుడు ఒక్కలారీ కూడా పంపించడం గగనంగా మారింది.

– పాల రామకృష్ణారెడ్డి, నిమ్మకాయల వ్యాపారి, రాజమహేంద్రవరం

దిగజారుడుతనానికి దిక్సూచి టీడీపీ

జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మహ్మద్ ఆరీఫ్



ప్రకాశం నగర్: ప్రజల చేత తిరస్కారానికి గురైన టీడీపీ.. దిగజారుడుతనానికి దిక్సూచిలా వ్యవహరిస్తోందని జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మహ్మద్ ఆరీఫ్ విమర్శించారు. స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లోకేష్ చేస్తున్న వ్యాఖ్యలు టీడీపీకి మేలు చేయకపోగా, ఆ పార్టీని జనాలు మరింత చీదరించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. దానినుంచి దృష్టి మరల్చడానికి చంద్రబాబు ఒక నీచమైన పుస్తక ప్రచురణతో కొత్త నాటకానికి తెరలేపారన్నారు. తెలుగుదేశం పార్టీ చేసిన దురాగతాలను ప్రచురించాలంటే ఒక్కొక్క నాయకుడికి ఒక్కొక్క పుస్తకం సరిపోదన్నారు. జగనన్న చేస్తున్న మంచిని, సంక్షేమాన్ని తెలుగు ప్రజలు తమ హృదయాల్లో చిరస్థాయిగా రచించి, నెమరు వేసుకుంటారన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ మేలు చేసే సంక్షేమ పాలన అందించడమే ముఖ్యమంత్రి జగన్ ధ్యేయమన్నారు.

డీసీసీబీ చైర్మన్ వీర్రాజు పరామర్శ

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని పలు కుటుంబాలను డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు బుధవారం పరామర్శించారు. తిరుమలశెట్టి సత్యం, సిద్ధిరెడ్డి నరసింహమూర్తి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబాలను వీర్రాజు పరామర్శించారు. ఆయన వెంట ఆకుల విజయ్, బోడపాటి సత్యనారాయణ, బోడపాటి మూర్తి, బొర్సు వీర్రాజు, బొబ్బిలి భాస్కరరావు ఉన్నారు.



సత్యం చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

స్కూటర్ చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి ముందు పార్కు చేసిన స్కూటర్ చోరీకి గురైందని మోరంపూడి బాలకృష్ణ సిరమిక్స్ ప్రాంతానికి చెందిన పడగాని కిశోర్ బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఈనెల 9వ తేదీ రాత్రి ఇంటి ముందు స్కూటర్‌ను పార్క్ చేశారు. తర్వాతి రోజు ఉదయం 9 గంటలకు లేచి చూసేసరికి ఆ స్కూటర్ మాయమైంది. ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ సమాచార దర్శిని ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: రైతులకు వివిధ ప్రభుత్వ పథకాలను త్వరితగతిన అందజేసేందుకు వ్యవసాయ విస్తరణాధికారులు కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయ విస్తరణాధికారుల వ్యవసాయ సమాచార దర్శినిని ఆయన ఆవిష్కరించారు. ఈ పంట నమోదు, ఈకేవైసీ వందశాతం జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్ర ఏఈవోల సంఘం అధ్యక్షుడు డి.వేణు మాధవరావు, ప్రచార కార్యదర్శి పీటర్, నాని బాబు, ఎస్‌పీ శ్రీను, పీపీ శ్రీను, సంధ్య పాల్గొన్నారు.

వికాస్ కాలేజీలో ఫ్రెషర్స్‌డే

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయం సమీపంలోని వికాస్ ఫార్మసీ కాలేజీలో బుధవారం ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.సుమలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియన్ ఫార్మసీ అసోసియేషన్ (ఐపీఏ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ మాట్లాడుతూ ఔషధం గురించి తెలుసుకునేందుకు ఫార్మావిద్య బాగుంటుందని, దీనిలో చేరిన విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

కంబాలచెరువు: కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం విద్యారంగానికి నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో స్థానిక ఉమెన్స్ కాలేజీ వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 2.5 శాతం మాత్రమే కేటాయించారని, నిధులు పెంచకుండా విద్యారంగం ఎలా అభివృద్ధి అవుతుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి . కిరణ్ కుమార్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- సీఎం జగన్ దృష్టికి తీసుకువెళతా
- కల్లుగీత కార్మికులతో ఎంపీ భరత్ రామ్



ఎంపీ భరత్‌రామ్‌ను సత్కరిస్తున్న కాపు సంఘం నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మీ సమస్యలు తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ కల్లుగీత కార్మికులకు హామీ ఇచ్చారు. నగర గౌడ, శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికులు బుధవారం ఉదయం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో భరత్‌రామ్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. కల్లు విక్రయించేందుకు వెయ్యి గజాల స్థలాన్ని ప్రభుత్వ పరంగా ఇప్పించాలని, నగర పరిధిలో నీరా యూనిట్ ద్వారా వందల గీత కార్మికుల జీవితాలు బాగుపడతాయని తెలిపారు. బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు మాట్లాడుతూ కుల వృత్తిని వదలలేకపోతున్న గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వ పరంగా కృషి చేయాల్సిన బాధ్యత బీసీ నేతలందరిపైనా ఉందన్నారు. కల్లు నుంచి వివిధ దేశాలలో అనేక రకాల ఉత్పత్తులు, ఔషధాలను తయారు చేస్తున్నారని ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే కల్లుగీత కార్మికుల జీవన స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో నగర గౌడ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు రెడ్డి రాజు, కడలి వెంకటేశ్వరరావు, పామర్తి గోపాలరావు, మట్టా శేషు, మట్టా శ్రీను, గుత్తుల దుర్గారావు, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘం కృతజ్ఞతలు



కల్లుగీత కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గుర్రం గౌతమ్ తల్లి సూర్యావతిని ద్వారకా తిరుమల ట్రస్టుబోర్డు డైరెక్టర్‌గా నియమించడంపై రాజమహేంద్రవరం నగర కాపు సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఇందుకు కృషి చేసిన వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు ఆ సంఘ ప్రముఖులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయానికి తరలివచ్చారు. రాబోయే కమిటీలలో కూడా కాపులకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీకి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర కాపు సంఘం ఉపాధ్యక్షుడు చవ్వాకుల రంగనాథ్, జనరల్ సెక్రటరీ వక్కపాటి మురళి, ఆర్‌వీ బాబ్జీ, మానె దొరబాబు, జవ్వాది సూర్య పాల్గొన్నారు.

అడుగడుగునా ఆధ్యాత్మిక శోభ

- శివరాత్రికి ఆలయాల ముస్తాబు
- ఏర్పాట్లు చేస్తున్న కమిటీలు



కడియపులంకలోని అనంతేశ్వరాలయం



రాజమహేంద్రవరంలో ఘాట్‌ను శుభ్రం చేస్తున్న కార్మికులు

కడియం: మండలంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఈనెల 18వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఏడు ప్రముఖ శివాలయాలున్నాయి. కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి, దుళ్లలోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి, వీరవరంలోని సోమేశ్వరస్వామి, జేగురుపాడులోని నగరేశ్వరస్వామి, మురమండ, వేమగిరి గ్రామాల్లోని శివాలయాలు, కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాల్లో శివరాత్రి పర్వదినానికి ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు. కడియపులంక మినహా మిగిలిన ఆలయాలు దేవదాయశాఖ పరిధిలో ఉన్నాయి. ఆయా ఆలయాల కమిటీలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి. వీటిలోని దుళ్ల, వీరవరంలో ఆలయాలను సుమారు పదేళ్ల క్రితం పునర్నిర్మించారు. శివరాత్రి నేపథ్యంలో ఆయా ఆలయాలను ప్రత్యేక విద్యుద్దీపాలతో అలంకరించారు.

ప్రత్యేక కార్యక్రమాలు

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో 16వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణం ఆలయ అర్చకుడు అప్పిలి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో జరుగుతుంది. మహాశివరాత్రి సాయంత్రం నాలుగు గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

- దుళ్లలోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో 16న కల్యాణం, 18న మహాశివరాత్రి సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు. అదేరోజు కోలాట భజన బృందాలు, మంగళ వాయిద్యాల నడుమ రథోత్సవం జరుగుతుంది. బాదంపూడి సత్యనారాయణ శివాచార్యుల పర్యవేక్షణలో 16 నుంచి ఐదు రోజుల పాటు విశేష పూజలు ఉంటాయి.
- కడియపులంక పాత పువ్వుల మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏటా విశేష కార్యక్రమాలు జరుగుతాయి. ఈసారీ ఘనంగా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఇప్పటికే 158 మంది ఆంజనేయ మాలలు ధరించారు. ఆలయ 73వ వార్షికోత్సవం సందర్భంగా 16వ తేదీన 73 కలశాలతో ఆంజనేయ మాలధారులు గ్రామంలో హనుమాన్ విజయయాత్ర నిర్వహిస్తారు. 17న అఖండ దీపారాధన, దిక్‌పాలక పూజలు ఉంటాయి. 17వ తేదీ రాత్రి 8 గంటల నుంచి బాణసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. రాత్రి స్వామివారి ఊరేగింపు జరుగుతుంది. 18న ప్రత్యేక పూజల అనంతరం స్వామి దర్శనం, మహాన్నసంతర్పణ ఉంటుంది. 19 మధ్యాహ్నం కోలాటం, రాత్రి కేరళ వాయిద్యాలతో ప్రత్యేక కార్యక్రమం, 20న సహస్ర దీపాలంకరణ, అఖండ హారతులు నిర్వహిస్తారు. 21న సువర్చలా ఆంజనేయస్వామిరి శాంతికల్యాణం, 22న ఆవు పెరుగుతో అభిషేకాలు చేస్తారు.

మహాశివరాత్రికి ఘాట్లు సిద్ధం

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రికి నగరంలోని గోదావరి ఘాట్లు సిద్ధమవుతున్నాయి. నగరంలోని 10 ఘాట్లలో భక్తుల పుణ్యస్నానాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. రోజుకు వందమంది పారిశుధ్య కార్మికులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు నగర పాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్ తెలిపారు. కోటిలింగాల ఘాట్, లక్ష్మీ గణపతి ఘాట్, చింతాలమ్మ ఘాట్, పుష్కరఘాట్, పుష్కరఘాట్–2, మార్కండేయస్వామి ఘాట్, అయ్యప్పస్వామి దేవాలయ ఘాట్, వైగ్రామ్ ఘాట్, సరస్వతీ ఘాట్, గౌతమఘాట్‌లలో అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ గురువారం వరకూ కొనసాగుతుందన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: శ్రీరామపురంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ జగన్మాత ఆశీసులు అందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనకు శ్రీరామపురం, దివాన్ చెరువు, శ్రీకృష్ణపట్నం, పుణ్యక్షేత్రం తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం

- వంగలపూడి నుంచి పట్టిసీమకు దారి ఏర్పాటు
- టెంట్లు, బారికేడ్లు, వసతుల కల్పన



పట్టిసీమ వెళ్లడానికి వంగలపూడి రేవు నుంచి గోదావరిపై ఏర్పాటు చేసిన దారి

సీతానగరం: మహాశివరాత్రి పర్వదినానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని వంగలపూడి రేవు నుంచి ఏలూరు (గతంలో పశ్చిమ గోదావరి) జిల్లాలోని పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి వెళ్లే భక్తుల కోసం గోదావరిలో దారి ఏర్పాటు చేశారు. రేవు నుంచి కిలోమీటరు దూరంలో గోదావరి పాయ ఉంది. దానిపై పంచాయతీ ఆధ్వర్యంలో దారి ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి శనివారం రావడం, శనిత్రయోదశి కావడంతో ఇక్కడి నుంచి లక్షమందికి పైగా భక్తులు పట్టిసీమకు వెళ్లే అవకాశం ఉంది. వంగలపూడి రేవు నుంచి కిలోమీటరు దూరం గోదావరి దాటిన తరువాత అక్కడ నుంచి సుమారుగా నాలుగు కిలోమీటర్లు ఇసుకలో నడిచి వీరభద్రుని ఆలయానికి చేరుకోవాలి.

వాహనాల ఏర్పాటు


ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సూచనల మేరకు భక్తుల కోసం మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సౌకర్యాలు కల్పిస్తున్నారు. భక్తులు తరలివెళ్లడానికి వంగలపూడి పంచాయతీ ఆధ్వర్యంలో ట్రాక్టర్లు ఏర్పాటు చేశారు. నడవలేని భక్తులకు రేవు నుంచి గోదావరి పాయ వరకు ట్రాక్టర్‌పై తరలించడానికి ఒకరి రూ.30, అక్కడి నుంచి పట్టిసీమ వీరభద్రుని ఆలయం వరకు రూ.50 వసూలు చేస్తారు.

అన్ని సౌకర్యాలు

ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, పంచాయతీరాజ్ జేఈ ప్రసాద్, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి నాగ సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు కొంచ భాస్కరరావు, నీరుకొండ శ్రీనివాస్, గోలి శ్రీను, సూరెడ్డి పోశియ్య, అంబటి రమణ తదితరులు భక్తులకు కల్పించే సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. రేవు వద్ద సైకిల్ స్టాండ్‌ను రూ 45,200కు చొక్కా మౌళి, ట్రాక్టర్లపై భక్తులను తరలించడానికి రూ.60 వేలకు రమేష్ (బుజ్జి) పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో పాటను దక్కించుకున్నారు. సైకిల్ స్టాండ్‌లో టూవీలర్లకు రూ.30, కార్లకు రూ.100, ఆటోకు రూ.40 చొప్పున వసూలు చేయడానికి నిర్ణయించారు. ఎంపీడీవో, తహసీల్దార్లు వివిధ శాఖాధికారులతో మహాశివరాత్రి సందర్భంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. వంగలపూడి రేవు వద్ద భక్తుల సౌకర్యార్థం వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగునీరు, భక్తులకు మరుగుదొడ్లు, గోదావరి పాయ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

అంతా మాఇష్టం..

- విమానాశ్రయం రోడ్డుపై క్రేన్ ఏర్పాటు
- చంద్రబాబు పర్యటన కోసం టీడీపీ నాయకుల అత్యుత్సాహం
- రాకపోకలకు ప్రజల అవస్థలు



ఎయిర్‌పోర్టు ఎదురుగా రోడ్డుపై ఏర్పాటు చేసిన క్రేన్

మధురపూడి: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనతో బుధవారం ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. మధురపూడిలోని విమానాశ్రయం నుంచి బయటకు వచ్చే ఆయనకు గజమాల వేసి సత్కారం చేయాలని టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం జాతీయ రహదారి 516ఇపై క్రేన్‌ను అడ్డంగా ఉంచారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, ఆ పార్టీ నాయకుడు ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఏర్పాటు కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

దంపతులపై దాడికి యత్నం!

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన వేముల ఆంజనేయులు దంపతులపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి యత్నించారు. ఆంజనేయులు బుధవారం విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. భార్యతో కలిసి ఆంజనేయులు మోటారు సైకిల్‌పై మంగళవారం ద్వారపూడిలో వివాహానికి వెళ్లారు. వివాహ అనంతరం అదేరోజు తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి రాత్రి 9.45 గంటల సమయంలో నల్లని టీషర్టు, ఫ్యాంట్ వేసుకుని, ముఖానికి మాస్క్ ధరించిన ఓ వ్యక్తి వారి మోటారు సైకిల్‌కు అడ్డువచ్చి నిలువరించాడు. అదే సమయంలో వెనుక నుంచి ఇద్దరు వ్యక్తులు పరుగున రాసాగారు. వీరిని గమనించిన ఆంజనేయులు వేగంగా మోటారు సైకిల్‌ను ముందుకు పోనిచ్చాడు. వెనుక వచ్చిన ఓ వ్యక్తి చేతితో కొట్టడానికి ప్రయత్నించినా.. వీరు అందకుండా ముందుకు వెళ్లిపోయారు.